AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
14-3-2026 (Saturday) MAIN EDITION

## యూఎస్ ఎంబసీపై ఇరాన్ దాడి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. దాడులు, ప్రతిదాడులతో ఆయా దేశాల్లో బాంబుల మోత మోగుతోంది. తాజాగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ దాడి చేసింది. ఇరాన్‌లోని ఖార్గ్ ఐలాండ్‌పై యూఎస్ దళాలు బాంబుల వర్షం కురిపించాయి. ఖార్గ్ ద్వీపంలోని సైనిక కేంద్రాల్ని నాశనం చేశామని ట్రంప్ ప్రకటించారు. చమురు మౌలిక సదుపాయాలపై దాడి చేయలేదని వెల్లడించారు. హోర్ముజ్ జలసంధి వద్ద నౌకల రవాణాని అడ్డుకుంటే చమురు మౌలిక సదుపాయాలను టార్గెట్ చేస్తామని హెచ్చరించారు. యూఎస్ దాడికి ప్రతీకారంగా బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది.

## ఒక్క విద్యార్థి కోసం పరీక్ష కేంద్రం ఏర్పాటు




**అక్షరటుడే, నాగర్‌కర్నూల్ :** ఒక్క విద్యార్థి కోసం ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బందిని సైతం నియమించారు. తీరా సదరు విద్యార్థి పరీక్ష రాయడానికి రాకపోవడం గమనార్హం. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంటర్ బ్రిడ్జ్ కోర్సు పరీక్షకు వరుణ్ సందేశ్ అనే విద్యార్థి దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవల దరఖాస్తులు స్వీకరించగా.. ఒక్క విద్యార్థి మాత్రమే అప్లై చేశాడు. దీంతో అధికారులు పరీక్ష కోసం ఏర్పాట్లు చేశారు. ఐదుగురు సిబ్బందిని నియమించారు. పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. అయితే అప్లై చేసుకున్న ఒక్క విద్యార్థి కూడా పరీక్షకు డుమ్మా కొట్టాడు.

## గ్యాస్ కొరత ఎక్కడా లేదు




అక్షరటుడే, హైదరాబాద్: దేశంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. కొంతమంది కావాలనే కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. యుద్ధం వల్ల చాలా దేశాల్లో గ్యాస్ ధరలు పెరిగాయని.. మన దేశంలో మాత్రం పెరగలేదన్నారు. మోదీ ప్రభుత్వం ధరలను నియంత్రణలో పెట్టిందన్నారు.

## త్వరలో బీసీ రక్షణ చట్టం: ఏపీ మంత్రి



అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ముసాయిదా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కులం, వృత్తి పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టం విధివిధానాల రూపకల్పనపై మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర చర్చించారు.

## సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధం రద్దు



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయను పోలీసులు అరెస్ట్ చేశారు.



**ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ ప్రయోజనాలను ఆ పార్టీ పణంగా పెడుతోందని మండిపడ్డారు. అస్సాంలోని సిల్చార్ వేదికగా శనివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు.** –అక్షరటుడే, నేషనల్‌డెస్క్

# విదేశీ శక్తుల చేతుల్లో

# కాంగ్రెస్

■ ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు యత్నం ■ ప్రధాని మోదీ విమర్శలు ■ అభివృద్ధి పనులకు భూమిపూజ

భారత్ సాధిస్తున్న వృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న కొన్ని అంతర్జాతీయ శక్తుల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కీలుబొమ్మగా మారుతోందని ప్రధాని ఆరోపించారు. ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. ఈ క్లిష్ట సమయంలో దేశ ప్రజలపై ఆ ప్రభావం పడకుండా తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

**మోదీని నిందించాలని..**

దేశం ఇబ్బందుల్లో చిక్కుకోవాలని, తద్వారా మోదీని నిందించవచ్చని వారు ఆశిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల కనెక్టివిటీని మెరుగుపరిచే పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 22,860 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'షిల్లాంగ్‌సిల్చార్ కారిడార్'కు భూమిపూజ చేశారు. సిల్చార్‌లోని ఎన్‌హెచ్ 306 పై నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిపూజ చేశారు. కరీంగంజ్ జిల్లాలోని పత్తర్‌కండి వద్ద కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అస్సాంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, విపక్షాలు విమర్శలకే పరిమితమవుతున్నాయని మోదీ అన్నారు.

## బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఉత్తర కొరియా



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తలతో ఇప్పటికే ప్రపంచం అంతా ఇప్పటికే ఆందోళన చెందుతోంది. తాజాగా ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. నార్త్ కొరియా 10 క్షిపణులను ప్రయోగించినట్లుగా జపాన్ ప్రకటించింది. ఉత్తర కొరియా శనివారం సముద్రంలోకి 10కి పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. జపాన్ తీరప్రాంత రక్షక దళం సముద్రంలో పడిపోయిన బాలిస్టిక్ క్షిపణిని గుర్తించినట్లు తెలిపింది. దక్షిణ కొరియా, వాషింగ్టన్ ఈ వారం దక్షిణ కొరియాలో వార్షిక ప్రధాన కసరత్తులను ప్రారంభించాయి. దాదాపు 28,500 మంది యూఎస్ సైనికులు, స్క్వాడ్రన్ల ఫైటర్ జెట్‌లు దక్షిణ కొరియాలో ఉన్నాయి. ఈ క్రమంలో ఉత్తర కొరియా క్షిపణులు ప్రయోగించడం గమనార్హం.

## వాచ్‌మన్ దంపతుల హత్య

**అక్షరటుడే, మెదక్:** సంగారెడ్డి జిల్లా ఇంద్రేశంలో దంపతుల హత్య కలకలం రేపింది. వాచ్‌మన్‌గా పనిచేస్తున్న దంపతులను రాడ్డుతో కొట్టి శుక్రవారం రాత్రి దుండగులు హత్య చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా గూడూరు మండలం దొంగచింత తండాకు చెందిన ధరావత్ సోములు, ధరావత్ మంగమ్మ కొంతకాలంగా నిర్మాణంలో ఉన్న భవనంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. అర్ధరాత్రి వారిని దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

## దుబాయి పర్యాటక రంగంపై ఎఫెక్ట్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు అట్టుడుకుతున్నాయి. ఆయా దేశాల్లోని అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా దుబాయిలోని పర్యాటక రంగం కళ తప్పింది. దుబాయిని గతంలో నిత్యం లక్షలాది మంది పర్యాటకులు సందర్శించేవారు. వివిధ దేశాల నుంచి అక్కడకు ప్రయాణం చేసేవారు. ఇరాన్ దాడులతో ఇప్పుడు దుబాయి అంటేనే భయపడుతున్నారు. ఆ దేశంలోని బీచ్‌లు, బార్లు, స్విమ్మింగ్ పూల్స్, ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఇప్పుడు ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో దుబాయి పర్యాటక పరిశ్రమ ప్రత్యేక ఆఫర్లు, ఉచిత ప్రవేశ ఒప్పందాలను ప్రవేశపెడుతోంది.

## కొండగట్టు అభివృద్ధి బాధ్యత తీసుకుంటా : బండి సంజయ్



**అక్షరటుడే, కరీంనగర్ :** కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధి బాధ్యతలు తాను తీసుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆయన శనివారం కరీంనగర్ నుంచి కొండగట్టుకు అంజన్న ఆశీర్వాద యాత్ర ప్రారంభించారు. పాదయాత్రగా స్వామి దర్శనానికి బయలు దేరారు. యాత్ర ప్రారంభించే ముందు ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. కొండగట్టుకు తాను చేపట్టిన ఈ పాదయాత్ర రాజకీయాలకు అతీతం అని తెలిపారు. దేశ సేవ, ధర్మ రక్షణ కోసం ఎన్నికల్లో పోటీ చేశామని చెప్పారు. అజన్న ఆశీస్సులతో కరీంనగర్‌లో కాషాయ జెండా ఎగురవేశామన్నారు. ఆ మొక్కు చెల్లించుకునేందుకే పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు అంజన్న సన్నిధి వరకు 40 కిలోమీటర్ల పాదయాత్ర సాగనుంది. భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు యాత్రలో పాల్గొన్నాయి.

## అమెరికాకు ఇరాన్ బిగ్ షాక్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులను ఇరాన్ కొనసాగిస్తోంది. మరోవైపు హోర్ముజ్ జలసంధిని మూసివేసి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావానికి కారణమైంది. ఈ క్రమంలో తాజాగా హోర్ముజ్ జల సంధి ద్వారా నౌకల అనుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి అంగీకరించినట్లు సమాచారం. అయితే డాలర్‌కు బదులుగా.. చైనీస్ యువా న్‌లో చెల్లింపులు చేయాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. చైనా యువాన్‌లను ద్వారా కొనుగోలు చేసిన ఆయిల్ మాత్రమే హోర్ముజ్ జల సంధి ద్వారా అనుమతిస్తామని తెలిపినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం చమురు వ్యాపారం మొత్తం డాలర్ల రూపంలోనే జరుగుతోంది. అన్ని దేశాలు డాలర్లు చెల్లించి గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నాయి. దీంతో డాలర్ బలపడుతూ వచ్చింది. ఈ క్రమంలో తాజాగా ఇరాన్ డాలర్ ఆధిపత్యానికి గండిపడేలా ప్లాన్ వేసింది.

## పాక్‌పై డ్రోన్లతో విరుచుకుపడ్డ తాలిబన్లు..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** పాకిస్థాన్‌పై అఫ్గాన్ తాలిబన్ ప్రభుత్వం డ్రోన్లతో దాడులు చేసింది. ఈ ఘటనలో నలుగురు పాక్ పౌరులు గాయపడ్డట్లు ఆ దేశ అధికారులు తెలిపారు. తాలిబన్ల దాడులను పాక్ మంత్రి ఖండించారు. జన నివాస ప్రాంతాలలో దాడులు చేస్తే సహించం అన్నారు. పాకిస్థాన్ ఇటీవల అఫ్గానిస్థాన్‌పై వైమానిక దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా తాలిబన్లు డ్రోన్ దాడులు చేయడం గమనార్హం. కాగా గతంలో భూతల దాడులు మాత్ర మే చేపట్టిన తాలిబన్లు తాజాగా డ్రోన్లతో విరుచుకుపడటం గమనార్హం. పాకిస్థాన్‌లోని లక్ష్యాలను చేరుకోవడానికి ముందే తమ భద్రతా దళాలు తాలిబాన్ డ్రోన్‌లను అడ్డుకున్నాయని పాక్ తెలిపింది.

## యుద్ధాన్ని ఆపాలి: కేఏ పాల్

**అక్షరటుడే, హైదరాబాద్ :** అమెరికా యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని కేఏ పాల్ డిమాండ్ చేశారు. ఈ యుద్ధ ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందన్నారు. గ్యాస్ కొరతతో ఇండియా ఇబ్బంది పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన వీడియో విడుదల చేశారు. కేఏ పాల్ ఇప్పటికే పలు దేశాల నేతలతో చర్చలు జరిపారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం వరకు యుద్ధం ముగుస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని మియామిలో ఉన్నారు. యుద్ధం ఆపడానికి శాంతి చర్చల్లో తాను బిజీగా ఉన్నానని పేర్కొన్నారు.

## భార్యను సుత్తితో కొట్టి చంపిన భర్త




**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా భార్యని క్షణికావేశంలో సుత్తితో కొట్టి భర్త హత్య చేశాడు. హయత్ నగర్ పరిధిలోని పసుమాముల గ్రామంలో ఆంజనేయులు, ఉమారాణి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సైతం గొడవ జరగడంతో ఆంజనేయులు క్షణికావేశంలో తన భార్యను సుత్తితో కొట్టాడు. రక్తపు మడుగులో ఉన్న తన భార్యను చూసి భయపడిన నిందితుడు ప్రమాదవశాత్తు పెయింట్ డబ్బా తలపై పడిందని నాటకం ఆడాడు. కూతుళ్ల ఫిర్యాదుతో అసలు విషయం వెలుగు చూసింది.

## 'కుందనపు బొమ్మ'లా మెరిసిపోయిన సారా



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇంట పెళ్లి సందడి మొదలైంది. సచిన్ కుమారుడు అర్జున్ టెండూల్కర్, ప్రముఖ పారిశ్రామిక వేత్త సానియా చందోక్ త్వరలో వివాహ బంధంతో ఒకటి కాబోతున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రీ-వెడ్డింగ్ వేడుకల్లో సచిన్ కూతురు సారా టెండూల్కర్ తన అందంతో అందరి దృష్టిని ఆకర్షించింది. తన సోదరుడి మెహెందీ, సంగీత్ వేడుకలకు సంబంధించిన మధురమైన జ్ఞాపకాలను సారా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి నెట్టింట వైరల్ అయ్యాయి. సారా తన సోదరుడి వివాహ వేడుకల్లో 'కుందనపు బొమ్మ'లా మెరిసిపోయింది. తను ధరించిన దేశీ దుస్తులు ఆమెకు స్పెషల్ గ్లామర్‌ను అద్దాయి.

–అక్షరటుడే, నేషనల్‌డెస్క్